# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 15-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో గ్రామీణ మహిళల భాగస్వామ్యం కీలకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- 2026 ఆసియా క్రీడలు భారత్ కు చిరస్మరణీయంగా నిలిచాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.
- రక్షణ రంగంలో 4 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకుంది.
- కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాల్లో ఈ నెల 21వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ - 2047 లక్ష్యాన్ని సాధించడంలో గ్రామీణ మహిళల క్రియాశీల భాగస్వామ్యం కీలకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. గ్రామీణ మహిళలకు మరిన్ని ఆర్థిక సాధికారత అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడలో జాతీయ సరస్ మేళా-2026ను రాష్ట్రపతి ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాలతో అనుబంధమున్న మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధిస్తూ తమ కుటుంబాల అభ్యున్నతికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి, దేశ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు. మహిళల ఆర్థిక స్వావలంబన పెరిగినప్పుడు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందన్నారు. గ్రామీణ మహిళల నైపుణ్యాలను ప్రోత్సహించడం, వారికి ఉపాధి, ఆదాయ అవకాశాలను విస్తరించడం ద్వారా దేశ నిర్మాణంలో వారి భాగస్వామ్యాన్ని మరింత పెంచవచ్చని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2026 ఆసియా క్రీడల్లో పాల్గొన్న భారత క్రీడాకారుల బృందంతో ఈరోజు సమావేశమై మాట్లాడారు. యువ క్రీడాకారులు తమ అభిరుచిని విజయాలుగా మలుచుకుని పతకాలు సాధించడంతో పాటు, దేశానికి గర్వకారణమైన ఆనందాన్ని తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రీడా వేదికలపై భారత ప్రతిభను చాటుతూ, దేశ కీర్తిని పెంపొందిస్తున్న యువ క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన 85 పతకాలలో మహిళా క్రీడాకారుల పాత్రను ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. భారత మహిళా క్రీడాకారులు 11 స్వర్ణ పతకాలతో సహా మొత్తం 38 పతకాలు సాధించడం పట్ల నరేంద్రమోదీ అభినందనలు తెలిపారు. 2026 ఆసియా క్రీడలు భారత్‌కు చిరస్మరణీయంగా

నిలిచాయన్నారు. క్రీడాకారులు తమ అద్భుత ప్రదర్శనతో భారత త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించారని, దేశ గౌరవ ప్రతిష్ఠలను మరింత ఇనుమడింపజేశారని ప్రధానమంత్రి ప్రశంసిస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

రక్షణ రంగంలో 4 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకుంది. భారత వైమానిక దళం కోసం జీశాట్-7సీ ప్రత్యేక సమాచార ఉపగ్రహ సామర్థ్యాన్ని సమకూర్చుకోవడంతో పాటు భారత నౌకాదళం కోసం వరుణాస్త్ర హెవీ వెయిట్ టార్పెడోలను కొనుగోలు చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ 4 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన ఒప్పందాలపై ఈరోజు సంతకాలు చేసింది. న్యూఢిల్లీలో రక్షణ శాఖ అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఏ. అన్ బరసు సమక్షంలో ఈ ఒప్పందాలు కుదిరాయి. జీశాట్-7సీ ఉపగ్రహాన్ని సమకూర్చుకునేందుకు 2 వేల 500 కోట్ల రూపాయలకు పైగా విలువైన ఒప్పందాన్ని బెంగళూరుకు చెందిన న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్‌తో కుదుర్చుకున్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపకల్పన చేసి, అభివృద్ధి చేసిన ఈ ఉపగ్రహం భారత వైమానిక దళానికి చెందిన వివిధ వ్యవస్థలు, వనరుల మధ్య సురక్షితమైన, పటిష్ఠమైన, నిరంతర సమాచార ప్రసార సామర్థ్యాలను మెరుగుపరుస్తుందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. తద్వారా వైమానిక దళం కార్యకలాపాల సామర్థ్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

మతం మారినంత మాత్రాన బీసీ రిజర్వేషన్ పొందలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హిందూ మతం నుంచి ఇస్లాం వంటి ఇతర మతాల్లోకి మారిన వ్యక్తులు, తమ పాత సామాజిక వర్గం ఆధారంగా బీసీ రిజర్వేషన్‌ను కోరలేరని తేల్చిచెప్పింది. ఒక మతంలో ఉన్న సామాజిక వెనకబాటుతనాన్ని మరో మతంలోకి మారిన తర్వాత కూడా అదే విధంగా పరిగణించలేమని పేర్కొంది. ఈ మేరకు తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఆ అంశంపై మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ శ్రీచంద్రశేఖర్‌తో కూడిన ధర్మాసనం ఈరోజు తీర్పు వెలువరించింది. హిందూ సామాజిక వ్యవస్థ నుంచి మరో మతంలోకి మారిన వ్యక్తి, గతంలో తన సామాజిక వర్గానికి ఉన్న వెనకబాటుతనాన్ని చూపించి రిజర్వేషన్ పొందలేరని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విషయంలో మద్రాస్ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

భారత్ స్వదేశీ రక్షణ ఉత్పత్తులను దాదాపు 100 దేశాలకు ఎగుమతి చేస్తోందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలిపారు. దేశ రక్షణ ఎగుమతులు 2013-14లో 686 కోట్ల రూపాయలుగా ఉండగా, 2025-26 నాటికి 38 వేల కోట్ల రూపాయలకు పైగా పెరిగాయని వెల్లడించారు. న్యూఢిల్లీలో ఈరోజు ఒక ప్రైవేట్ ఛానల్ నిర్వహించిన డిఫెన్స్ కాన్‌క్లేవ్-2026లో ఆయన ప్రసంగిస్తూ.. భారత్ రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా గణనీయమైన పురోగతి సాధించిందని చెప్పారు. ముఖ్యంగా పేలుడు సామగ్రిలోని వివిధ రకాల ఉత్పత్తుల తయారీలో 90 శాతానికి పైగా స్వయం సమృద్ధి సాధించినట్లు తెలిపారు. స్వదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించడం, ఎగుమతులను విస్తరించడం ద్వారా అంతర్జాతీయ రక్షణ రంగంలో భారత్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోందని చెప్పారు. సరిహద్దుల అవతలి నుంచి జరిగే ఉగ్రవాదంపై భారతదేశ వైఖరిని పునరుద్ఘాటిస్తూ, పాకిస్థాన్ నుంచి భవిష్యత్తులో ఎలాంటి ఉగ్రవాద చర్యలు జరిగినా, భారత్ మరింత బలమైన ప్రతిస్పందన ఇస్తుందని రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో దేశ భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తామని ఆయన పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

కేరళ, తమిళనాడు, మాహే, పుదుచ్చేరి ప్రాంతాల్లో ఈ నెల 21వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. హర్యానా, చండీగఢ్, పంజాబ్, ఢిల్లీలో ఈరోజు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఇదిలా ఉండగా, జమ్మూ కశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఎత్తైన ప్రాంతాల్లో ఈ సీజన్‌లో తొలిసారిగా మంచు కురిసింది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తూ 14 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్.ఐ.ఆర్ చేపట్టాలని భారత ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ ప్రక్రియ చేపట్టాల్సిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అండమాన్ నికోబార్ దీవులు, అస్సాం, బీహార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, మణిపూర్, పుదుచ్చేరి, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్ ఉన్నాయి. ఎస్.ఐ.ఆర్ కొనసాగుతున్న లేదా ఇటీవల పూర్తయిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సవరించిన షెడ్యూల్‌ను తరువాత ప్రకటిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

అమెరికాలోని లాస్ వెగాస్ లో జరుగుతున్న అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ లో భారత రెజ్లర్ విశ్వజిత్ రామచంద్ర మోరే రజత పతకాన్ని సాధించారు. ఈరోజు జరిగిన గ్రీకో-రోమన్ విభాగం ఫైనల్ మ్యాచ్ లో పురుషుల 55 కిలోల విభాగంలో ఆయన రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =